

సమస్య మెండైంది

ఒంగోలు అర్బన్, రూరల్ తహసీల్దార్ కార్యాలయాల్లో లాగిన్‌లలో గందరగోళం నెలకొంది.

- 8లో..



వారానికి రూ.700 వస్తున్నాయమ్మా..

ఉపాధి కూలి గిట్టుబాటు కావడం లేదని ఉపాధి కూలీలు కలెక్టర్ దృష్టికి తెచ్చారు.

- 8లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం
35 /28

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల చిరుజల్లులు పడవచ్చు. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

31న జిల్లా స్థాయి అథ్లెట్ల ఎంపిక

యర్రగొండపాలెం: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అడహక్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక గిరిజన గురుకుల పాఠశాలలో అథ్లెట్లను ఎంపిక చేయనున్నట్లు కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పి.రామచంద్రరావు, ఎం.వెంకటరెడ్డి మంగళవారం తెలిపారు. ఈ ఎంపికలో అండర్ 14, 16 విద్యార్థినీ, విద్యార్థులు, 18, 20 ఏళ్ల వయస్సు ఉన్న యువతీ, యువకులు పాల్గొనవచ్చన్నారు. ఎంపికైన అథ్లెట్స్‌ను బాపట్ల జిల్లా చీరాలలో జరిగే 36వ రాష్ట్ర స్థాయి జూనియర్ సౌత్‌జోన్ అథ్లెటిక్స్ మీట్‌కు ఎంపిక చేస్తామని వారు తెలిపారు. ఆసక్తి ఉన్న అథ్లెట్స్ తమ జనన ధ్రువీకరణ పత్రం, 10వ తరగతి మార్కుల జాబితా, ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో ఈ నెల 31వ తేదీ ఉదయం 8 గంటలలోపు హాజరు కావాలన్నారు. పూర్తి సమాచారం కోసం రాజు నాయక్, బ్రహ్మానాయక్ సెల్ నంబర్లు, 76750 26220, 99081 69358లకు సంప్రదించవచ్చని చెప్పారు.

అనుబంధ సంఘాల ఏర్పాటుపై సమీక్ష



ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డిని కలిసిన అప్పారెడ్డి

చీమకుర్తి: ప్రకాశం, బాపట్ల జిల్లాల వైఎస్సార్ సీపీ అనుబంధ సంఘాల ఇన్‌చార్జి మెట్టు వెంకట అప్పారెడ్డి మంగళవారం చీమకుర్తిలో ప్రకాశం జిల్లా వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ప్రకాశం జిల్లాలో అనుబంధ సంఘాల కమిటీలను ఏర్పాటు చేసేందుకు త్వరలో సమావేశం నిర్వహించనున్నట్లు వారు ఈ సందర్భంగా తెలిపారు.

ఎస్సీ కాలనీలో పాఠశాలను కొనసాగించాలి

- కలెక్టర్‌కు విన్నవించిన ఖాజీపురం ఎస్సీ కాలనీవాసులు



పాఠశాల తొలగించకుండా చూడాలని కోరుతున్న ఎస్సీకాలనీ వాసులు

కంభం: ఎస్సీకాలనీలో 40 ఏళ్లుగా ఉన్న పాఠశాలను తొలగించి మరోస్కూల్‌లో కలిపేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని బేస్తవారిపేట మండలం ఖాజీపురం ఎస్సీ కాలనీకి చెందిన పలువురు మహిళలు కలెక్టర్ తమీమ్ అన్సారియాకు ఫిర్యాదు చేశారు. మంగళవారం కంభంకు వచ్చిన కలెక్టర్‌ను వారు కలిసి తమ సమస్యను విన్నవించారు. గ్రామంలో ఉండే మెయిన్ స్కూల్‌లో విద్యార్థులు తక్కువగా ఉన్నారని, తమ స్కూల్‌లో 26 మంది పిల్లలున్నారని, కానీ ఇక్కడ ఉన్న పిల్లలను మెయిన్ స్కూల్‌లో చేర్పించి ఈ పాఠశాలను తొలగించే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. నెల రోజుల నుంచి మండల అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోయారు. ప్రధానోపాధ్యాయుడిని అడిగినా సరైన సమాధానం చెప్పడం లేదని ఫిర్యాదు చేశారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఉన్న స్కూల్‌ను యథావిధిగా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని కలెక్టర్ వారికి హామీ ఇచ్చారు.

తల్లికి వందనం డబ్బులు పడలేదమ్మా... !

తన ఇద్దరు పిల్లలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్నారని వారికి తల్లికి వందనం డబ్బులు పడలేదని బత్తుల వెంకటజ్యోతి అనే మహిళ మంగళవారం కంభం పర్యటనకు వచ్చిన కలెక్టర్ తమీమ్ అన్సారియా ముందు వాపోయింది. తర్లుపాడు మండలానికి చెందిన బత్తుల వెంకట జ్యోతి ఇద్దరు కవల పిల్లలు రాములు, లక్ష్మణ్ కంభం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నారు. వారికి తల్లికి వందనం డబ్బులు పడలేదని పాఠశాలలో అడిగితే గ్రీవెన్స్‌లో పెట్టుకుంటే పడతాయని చెప్పడంతో గ్రీవెన్స్‌లో అర్జీ పెట్టింది. ఆ తర్వాత కూడా డబ్బులు పడకపోవడంతో అక్కడికెళ్లి అడగ్గా స్కూల్‌లోనే వెళ్లి అడగండి అని చెబుతున్నారని ఆమె కలెక్టర్ దృష్టికి తెచ్చింది. అక్కడే ఉన్న ఎంఈఓను, ఎంపీడీఓను పిలిచిన కలెక్టర్ వారు ఏ సచివాలయం కిందకు వస్తారో.. ఎందుకు డబ్బులు పడలేదో వెంటనే విచారించండని ఆదేశించారు.



తల్లికి వందనం డబ్బులు పడలేదని కలెక్టర్‌కు చెబుతున్న విద్యార్థుల తల్లి

జిల్లాలో మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ల నియామకంలో కూటమి ప్రభుత్వం అడ్డగోలుగా వ్యవహరించింది. ఎస్సీ, ఎస్టీలకు దక్కాల్సిన పదవులను అగ్రకులాలకు అప్పగించి స్వయంగా ప్రభుత్వమే చట్టాన్ని ఉల్లంఘించింది. అధికారాన్ని అడ్డం పెట్టుకుని పెత్తనం చెలాయిస్తున్న కూటమి ప్రజాప్రతినిధులకు ఉన్నతాధికారులు సైతం జీ హుజూర్ అనడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తమకు దక్కాల్సిన పదవులను వేరేవారికి కట్టబెట్టడంపై అధికార పార్టీలోని ఎస్సీ, ఎస్టీ నాయకులు రగిలిపోతున్నారు. దళితుల హక్కులను కాలరాస్తున్నారని జిల్లాలోని ఎస్సీ, ఎస్టీలు మండిపడుతున్నారు. న్యాయం కోసం ఇప్పటికే కొందరు కోర్టు తలుపులు తట్టారు. మరికొందరు అదే దారిలో ఉన్నారు.



రూ.2 కోట్లకు మార్కెట్ యార్డు పదవి...

మార్కెట్ యార్డు పదవులకు జిల్లాలో భారీగా డిమాండ్ ఏర్పడింది. ఈ పదవి కోసం టీడీపీలోని ఓసీ సామాజిక వర్గానికి చెందిన నాయకులు ఎంతకైనా రెడీ అంటున్నట్టు సమాచారం. పశ్చిమ ప్రకాశం జిల్లాలోని ఒక కీలక నియోజకవర్గంలో రూ.2 కోట్లకు మార్కెట్ యార్డు చైర్మన్ పదవిని అమ్ముకున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. జిల్లా కేంద్రానికి దగ్గరగా ఉన్న మరో నియోజకవర్గంలో కూడా ఈ పదవికి మంచి ధర పలికినట్లు చెప్పుకుంటున్నారు. తెరవెనుక పెద్ద ఎత్తున లాలూచీలు జరగడంతోనే ఎస్సీ, ఎస్టీలకు రిజర్వ్ చేసిన పదవులను వారికి దక్కకుండా చేశారని గుసగుసలు వినిపిస్తున్నాయి.

అగ్రతాంబూలం..

రిజర్వేషన్లు మాయం!

- జిల్లాలో గందరగోళంగా మార్కెట్ యార్డ్ ఛైర్మన్ పదవుల కేటాయింపులు
- పది స్థానాల్లో 4 జనరల్, 3 బీసీలకు, 2 ఎస్సీలకు, 1 ఎస్టీకి
- రిజర్వేషన్లకు తిలోదకాలిచ్చిన కూటమి ప్రభుత్వం
- ఎస్సీ, ఎస్టీ స్థానాల్లో ఓసీలకు పదవులు
- మహిళకు రిజర్వ్ చేసిన పొదిలి మార్కెట్ యార్డు ఛైర్మన్ కుర్చీలో పురుషుడికి పట్టం
- కనిగిరి, దర్శిలు ఎస్సీలకు కేటాయిస్తే..ఓసీల నియామకం
- అంతా మాఇష్టం అంటున్న టీడీపీ నాయకులు
- పశ్చిమాన ఛైర్మన్‌గిరికి రూ.2 కోట్ల ముడుపులు
- రగలిపోతున్న ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ నాయకులు

సాక్షి ప్రతినిధి,ఒంగోలు: జిల్లాలో 10 మార్కెట్ యార్డులు ఉన్నాయి. యార్డు చైర్మన్ పదవుల నియామకం విషయంలో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 50 శాతం రిజర్వేషన్లను ఖరారు చేసింది. బీసీ వెల్ఫేర్ డిపార్టుమెంట్ ద్వారా జీవో నంబర్ ఎంఎస్ 77ను విడుదల చేసింది. దీని ప్రకారమే రిజర్వేషన్లు నిర్ణయించాలని ప్రస్తుత కూటమి ప్రభుత్వం తొలుత కలెక్టర్లకు ఆదేశాలు ఇచ్చింది. ఈ ఆదేశాలననుసరించి జనాభా ప్రతిపాదిక, రొటేషన్ విధానం ద్వారా జూన్ 6వ తేదీ రిజర్వేషన్లను ఖరారు చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వుల ప్రకారం జిల్లాలోని కనిగిరి దర్శి మార్కెట్ యార్డులను ఎస్సీలకు రిజర్వ్ చేశారు. యర్రగొండపాలెం మార్కెట్ యార్డు పదవిని ఎస్టీలకు కేటాయించారు. ఒంగోలు, గిద్దలూరు బీసీ జనరల్‌కు, పొదిలి బీసీ మైనార్టీ మహిళకు కేటాయించారు. మొత్తం మీద ఓసీలకు 4, బీసీలకు 3, ఎస్సీలకు 2, ఎస్టీకి 1 రిజర్వ్ చేశారు. ఇక్కడ దాకా సజావుగా సాగినట్లు కనిపించింది. ఆ తర్వాత తాను ఇచ్చిన ఆదేశాలనే పక్కన పెట్టేసింది రాష్ట్ర ప్రభుత్వం. రిజర్వేషన్లు గిజర్వేషన్లు లేవు, అంతా మా ఇష్టం అన్నట్టుగా కూటమి పాలకులు సొంత రాజ్యాంగాన్ని అమలు చేయడానికి శ్రీకారం చుట్టారు.

దళితులు, ఆదివాసీల సీట్లపై కన్ను...

జిల్లాలోని 10 మార్కెట్ యార్డుల్లో 4 చోట్ల ఓసీలకు కేటాయించినా టీడీపీ నాయకులు ఎస్సీ, ఎస్టీలకు రిజర్వ్ చేసిన స్థానాలపై కన్నేశారు. ఇక్కడ కూడా తామే పెత్తనం చేయాలన్న దురుద్దేశంతో రిజర్వేషన్లను పక్కన పెట్టేశారు. అధికారం చేతిలో ఉండడంతో దొడ్డిదారిన వారి పదవులను అనుభవించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లాలో దళితులకు రిజర్వ్ అయిన కనిగిరి, దర్శి మార్కెట్ యార్డు పదవులను చేజిక్కించుకునేందుకు పావులు కదుపుతున్నారు. ఇప్పటికే కలెక్టర్ రిజర్వేషన్లను ప్రకటించినా టీడీపీ ఎమ్మెల్యేలు లెక్కచేయడం లేదు. ఆయా స్థానాల్లో ఓసీల అభ్యర్థులను ప్రకటించి నిబంధనలకు వ్యతిరేకంగా వారి చేత ప్రమాణ స్వీకారాలు చేయిస్తున్నారు. కూటమి పాలకుల బరితెగింపు చూసి ఎస్సీ, ఎస్టీ సంఘాలు మండిపడుతున్నాయి. గతంలో ఎన్నడూ ఇలా జరగలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఎస్సీకి రిజర్వ్ చేసిన కనిగిరి మార్కెట్ యార్డు చైర్మన్ పదవికి అధికార పార్టీ సామాజిక వర్గానికి చెందిన ఏరువ శ్రీనివాసరావుకు ప్రకటించారు. ఇప్పుడాయన స్థానంలో ఆయన సతీమణి రమాదేవికి ఇచ్చేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే లిస్టును హైకమాండ్ వద్దకు పంపించినట్లు తెలుస్తోంది. దీంతో ఇక్కడ టీడీపీలోని ఎస్సీలు నిరాశకు గురవుతున్నారు. తమ నోటికాడికి వచ్చిన అవకాశాన్ని లాగేసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అలాగే దర్శి మార్కెట్ యార్డులోనూ ఇదే తంతు కొనసాగుతోంది. ఎస్సీలకు రిజర్వ్ చేసిన ఈ స్థానంలో తొలుత బీసీ మహిళకు కట్టబెడుతూ ఈ నెల 10వ తేదీన ప్రభుత్వం జీవో ఆర్‌టీ నంబర్ 585 విడుదల చేసింది. నియోజకవర్గ ఇన్‌చార్జి ఒత్తిడితో మరుసటి రోజే ఈ ఉత్తర్వును రద్దు చేసింది. 11వ తేదీన ఓసీ మహిళకు రిజర్వ్ చేస్తూ మరో ఉత్తర్వును జారీ చేసింది. నిజానికి కలెక్టర్ ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం దర్శి మార్కెట్ యార్డు ఎస్సీలకు కేటాయించాల్సి ఉంది. కలెక్టర్ ఇచ్చిన ఉత్తర్వులను పక్కన పెట్టి తమ ఇష్టం వచ్చినట్లు రిజర్వేషన్లను మార్చుకుంటున్న కూటమి పాలకుల తీరు మీద తీవ్రమైన విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పొదిలి మార్కెట్ యార్డు పదవిని బీసీ మైనారిటీ మహిళకు కేటాయించగా అక్కడ మైనార్టీ పురుషుడిని నియమించడంపై విమర్శలు వ్యక్తమయ్యాయి.

ఎస్టీలకు రిజర్వ్ చేసిన యర్రగొండపాలెం నియోజకవర్గంలో కూడా ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరిస్తోందన్న ఆరోపణలు వినవస్తున్నాయి. ఎస్టీ జనాభా ఎక్కువగా ఉన్నప్పటికీ అధికార పార్టీ సామాజిక వర్గానికి చెందిన టీడీపీ నాయకుడికి మార్కెట్ యార్డు పదవిని కట్టబెట్టేందుకు కూటమి నేతలు పన్నాగాలు పన్నుతున్నారు.

యర్రగొండపాలెం చైర్మన్ నియామకానికి కోర్టు అడ్డుకట్ట..

మార్కెట్ యార్డు పదవుల భర్తీలో జిల్లా వ్యాప్తంగా రిజర్వేషన్లను అమలు చేయకుండా మొండిగా వ్యవహరిస్తున్న కూటమి పాలకులకు యర్రగొండపాలెంలో ఎదురు దెబ్బ తగిలింది. కూటమిలోని బీజేపీకి చెందిన ఎస్సీ నాయకులు, ఆలిండియా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఉద్యోగుల సంఘం మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆరె రమణయ్య ఎస్టీలకు కేటాయించిన యర్రగొండపాలెం మార్కెట్ యార్డును ఓసీలకు కేటాయించడాన్ని వ్యతిరేకిస్తూ హైకోర్టును ఆశ్రయించారు. ఎస్టీ జనరల్ రిజర్వేషన్ను అమలు చేయకుండా ఓసీ అభ్యర్థికి మార్కెట్ యార్డు పదవిని కట్టబెడుతూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు జీవో ఆర్‌టీ నంబర్ 593ను సవాల్ చేస్తూ ఆయన న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో జీవోను సస్పెండ్ చేస్తూ కోర్టు ఉత్తర్వులిచ్చింది. తదుపరి ఆగస్టు 4వ తేదీన వాదనలు వింటామని, అప్పటి వరకు సదరు ఓసీ అభ్యర్థి పదవి చేపట్టకూడదని, యార్డు వ్యవహారాల్లో జోక్యం చేసుకోకూడదని ఆదేశించింది. ఇదే విషయం మీద ఒక గిరిజన నాయకుడు కూడా కోర్టును ఆశ్రయించినట్లు సమాచారం. ఇదే విధంగా జిల్లాలోని కనిగిరి, దర్శి, పొదిలి మార్కెట్ యార్డుల విషయంలో ప్రభుత్వం విడుదల చేసిన జీవోను రద్దు చేయాలని కోరుతూ పలువురు ఎస్సీ సంఘాల నాయకులు హైకోర్టు తలుపు తట్టనున్నారని సమాచారం.

అత్యవసర షెడ్యూల్‌లో ఆంతర్యం ఏమిటి ?

- కొండపి పంచాయతీ ఎన్నికలపై మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్



కొండపి పంచాయతీ సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి సురేష్

కొండపి: కొండపి పంచాయతీ ఎన్నికలకు అత్యవసర షెడ్యూల్ ఇవ్వడంలో ఆంతర్యం ఏమిటని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి, కొండపి నియోజకవర్గ ఇన్చార్జ్ మాజీ మంత్రి సురేష్ ప్రశ్నించారు. మంగళవారం సాయంత్రం కొండపిలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కొండపి పంచాయతీ నాయకులతో ఎన్నికల గురించి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి సురేష్ మాట్లాడుతూ 2026 ఫిబ్రవరి నాటికి అన్ని పంచాయతీలకు గడువు ముగుస్తుందని కేవలం 6 నెలల మాత్రమే ఉన్న సందర్భంలో ఇప్పటికిప్పుడు కొండపి పంచాయతీకి షెడ్యూల్ ప్రకటించడంలో దాగి ఉన్న మర్మం ఏంటి అని ప్రశ్నించారు. కోర్టు కేసుల పెండింగ్ నుంచి రాష్ట్రంలో దాదాపు 27 పంచాయతీలు ఉన్నాయని, అందులో జిల్లాలో మంగమూరు పంచాయతీ కూడా ఉందని, కేవలం రెండు పంచాయతీలకు మాత్రమే ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఎన్నికల కమిషన్ ప్రకటించిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలో ఉందని మంత్రి స్వామి ఒత్తిడి చేసి ఎన్నికల నిర్వహిస్తున్నారన్నారు. ఓటర్ల జాబితా అంతా తప్పులు తడకగా ఉందని, దానితో ఎలక్షన్ కు ఎలా వెళతారని ప్రశ్నించారు. వార్డుల్లో ఓట్లను ఏ ప్రాతిపదికన నిర్ణయించారో ఎవరికీ అర్థం కాని అయోమయ పరిస్థితిలో ఉన్నారన్నారు. రానున్న ఆరు నెలల సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా జరిగే పంచాయతీ ఎన్నికలతో పాటు కొండపి పంచాయతీకి కూడా ఎన్నిక నిర్వహిస్తే అంతా సవ్యంగా ఉండేదన్నారు. నామినేషన్లకు కేవలం మూడు రోజుల మాత్రమే అవకాశం ఇచ్చారని, పోటీ చేసే అభ్యర్థులు ధ్రువపత్రాలు సిద్ధం చేసుకోవడానికి కూడా అవకాశం లేకుండా ఉందన్నారు. కేవలం మంత్రి స్వామి స్వలాభాపేక్ష కోసం మాత్రమే ఎన్నికల నిర్వహిస్తున్నారని పంచాయతీలోని ప్రజలందరూ గమనిస్తున్నారని అన్నారు. పంచాయతీలో పోటీ చేయడానికి ఒక కమిటీని వేశామని, కమిటీ ఆదేశాల మేరకు అభ్యర్థుల పోటీ పై నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ బచ్చల కోటేశ్వరరావు, గొట్టిపాటి మురళి, బొక్కిసం సుబ్బారావు, ఆరికట్ల కోటిలింగయ్య, వైస్ ఎంపీపీ రావులపల్లి కోటరాజు, యామవరపు వీర వసంతరావు, సుల్తాన్ వస్నూరు, హరి నారాయణ శేఖర్ రెడ్డి, రాయుడు, శివరాం, కొర్నేలు, వెంకటరావు, శ్రీను చిన్న వసంతరావు, వెంకటేశ్వర రెడ్డి, రమణారెడ్డి నజీర్, తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

అజెండాపై నిరసనలు..



రోడ్ల విస్తరణలో వ్యాపారులకు అన్యాయం చేయవద్దంటున్న వైఎస్సార్‌సీపీ ఫ్లోర్ లీడర్ ఇమ్రాన్ ఖాన్, పక్కన వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు



మేయర్ సుజాతకు వినతిపత్రం ఇస్తున్న వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు

- వాడీవేడీగా ఒంగోలు నగరపాలక సంస్థ సమావేశం
- ట్రంకు రోడ్డు విస్తరణలో వ్యాపారులకు నష్టపరిహారం ఇవ్వాలన్న వైఎస్సార్ సీపీ
- పూర్తిగా షాపులు కోల్పోయే వారికి ప్రత్యామ్నాయం చూపాలని డిమాండ్
- 'గడప గడపకు మన ప్రభుత్వం' పథకంలో అభివృద్ధి పనుల రద్దుపై సభలో రచ్చ
- పీవీ, కొణిజేటి విగ్రహాలను యథాతథంగా ఉంచాలన్న వైఎస్సార్ సీపీ, జనసేన సభ్యులు
- టీడీపీ, జనసేన సభ్యుల మధ్య మాటల యుద్ధం

ఒంగోలు సబర్బన్: నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశం అజెండా విషయంలో కార్పొరేటర్లు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. ట్రంకు రోడ్డు విస్తరణలో నష్టపోతున్న వారికి పరిహారం ఇవ్వాలని వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు పట్టుబట్టారు. ఒంగోలు నగర మేయర్ జి.సుజాత అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం మంగళవారం కార్యాలయ ప్రాంగణంలోని కౌన్సిల్ హాలులో నిర్వహించారు. అమృత్-2 పథకంలో మంచినీటి సరఫరా మెరుగుపరిచేందుకు, సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు నెలకొల్పటానికి, బత్తులవారి కుంట అభివృద్ధితో పాటు ఇతర పనులకు కలిపి రూ.484.55 కోట్ల కేటాయింపు విషయమై జనసేన కార్పొరేటర్ ఈదర చిన్నారి ప్రస్తావిస్తూ రూ.9 కోట్లు నగర పాలక సంస్థ మీద భారం వేయటం సబబుకాదన్నారు. అదేవిధంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కౌన్సిల్ ఆమోదం రూ.339.93 కోట్లు అయితే మరో రూ.100 కోట్లు ఎందుకు పెరిగిందో వివరించాలని మేయర్‌ను అడగగానే టీడీపీ సభ్యుడు తిప్పరపల్లి రవితేజ లేచి అడ్డుకోవటంతో సభలో కొంతసేపు వాదోపవాదాలు జరిగాయి. మంచినీటి సరఫరాకు సంబంధించి ఒకే అంశాన్ని మూడు, నాలుగు చోట్ల ఎందుకు పెట్టారని ఈదర సురేష్ ప్రశ్నించారు. అదేవిధంగా ఎన్‌టీఆర్ కళాక్షేత్రంలో గతంలో మున్సిపాలిటీకి డబ్బులు ఎగ్గొట్టిన వ్యక్తికే తిరిగి అప్పజెప్పటాన్ని జనసేన కార్పొరేటర్ యనమల నాగరాజు ప్రస్తావించారు. వాటి రికార్డులు కూడా కార్యాలయంలో లేవన్నారు.

ట్రంకు రోడ్డు విస్తరణలో వ్యాపారులకు నష్ట పరిహారం ఇవ్వాలి: వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు

నగర అభివృద్ధిలో భాగంగా ట్రంకు రోడ్డు, మస్తాన్ దర్గా నుంచి బీవీఎస్ హాలు మీదుగా కొత్తపట్నం బస్టాండ్ వరకు రోడ్డు విస్తరణ చేస్తున్న సందర్భంగా వ్యాపారులకు నగదు రూపంలో నష్టపరిహారం ఇవ్వాలని వైఎస్సార్ సీపీ ఫ్లోర్ లీడర్ ఇమ్రాన్ ఖాన్ కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు. విస్తరణతో నగరంలోని చిన్న, పెద్ద వ్యాపారులు తమ దుకాణాలను కోల్పోయి నిరాశ్రయులు అయ్యే అవకాశం ఉందన్నారు. గతంలో కూడా టీడీపీ ప్రభుత్వమే విస్తరణ చేపట్టిందని, అప్పట్లో వ్యాపారులకు ఎలాంటి నష్టపరిహారం ఇవ్వలేదన్నారు. వాళ్లను అన్ని రకాలుగా ఆదుకోవాలని, పూర్తిగా దుకాణాలు కోల్పోయిన వారికి ప్రత్యామ్నాయంగా మున్సిపల్ స్థలాలు వ్యాపార కూడళ్లలో కేటాయించాలన్నారు. వైఎస్సార్ సీపీ మరో సభ్యుడు జి.ప్రవీణ్ కుమార్ కూడా వ్యాపారులను ఆదుకోవాలని గొంతు కలిపారు. అదే విధంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో డివిజన్లలో పర్యటించినప్పుడు స్థానికులు చెప్పిన అభివృద్ధి పనులను గడప గడపకు మన ప్రభుత్వం (జీజీఎంపీ) పథకంలో చేపడితే వాటిని రద్దు చేయాలని టీడీపీ సభ్యులు చెప్పటం దారుణమని కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు. అప్పట్లో చేసిన పనులకు బిల్లులు చెల్లించకపోతే ఆ కాంట్రాక్టరు ఏం కావాలని నిలదీశారు. ఈ విషయమై డిప్యూటీ మేయర్, జనసేన నేత వెలనాటి మాధవరావు కూడా ఏకీభవించారు. కేటాయించిన పనులు ఆపటం సరికాదన్నారు. ప్రస్తుతం సాధారణ నిధులు ఖర్చు చేస్తున్నారని గతంలో పని చేసిన కాంట్రాక్టర్లకు రూ.కోట్ల బకాయిలు ఉన్నాయన్నారు. వాళ్లకు చెల్లించకుండా కొత్త పనులు ఏవిధంగా చేపడతారని ప్రశ్నించారు. అదేవిధంగా టీపీఎస్ పథకం కింద రూ.10 కోట్లు రావాల్సి ఉందని, వాటితో పాటు ఇతర ఆదాయ వనరుల కింద మున్సిపాలిటీకి రావాల్సినవి ఉన్నాయని, వాటిని రాబట్టడంలో అధికారులు వైఫల్యం చెందారన్నారు.

నగరంలో ఏర్పాటు చేసిన మాజీ ప్రధాన మంత్రి పీవీ.నరసింహారావు, మాజీ సీఎం కొణిజేటి రోశయ్య విగ్రహాలను తొలగించవద్దంటూ వైఎస్సార్‌సీపీ, జనసేన కార్పొరేటర్లు కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు. కూరగాయల మార్కెట్‌లో షాదీఖానాకు ఎదురుగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని స్థానిక కార్పొరేటర్ ప్రస్తావించారు. నగరంలో పారిశుధ్యం దారుణంగా ఉందని కార్పొరేటర్ ఈదర సురేష్ బాబు ప్రస్తావించారు. కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, బీఎన్.విజయ కుమార్, కమిషనర్ వెంకటేశ్వరరావు, ఎంఈ ఏసయ్య, ఏసీపీ సుధాకర్, డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

డబ్బులకు పీడించకు అన్నందుకు..

- కర్రలతో ఇష్టారాజ్యంగా దాడి
- తీవ్రగాయాలతో ఆస్పత్రి పాలు
- గిద్దలూరులో వడ్డీ వ్యాపారుల దాష్టీకం
- అధికార టీడీపీ అండదండలతో దాడులు
- మెడికల్ రిపోర్టు వచ్చాక కేసు నమోదు అంటున్న పోలీసులు



వడ్డీ వ్యాపారుల దాడిలో గాయపడిన సుధాకర్

గిద్దలూరు రూరల్: అధికార టీడీపీ అండదండలతో గిద్దలూరులో వడ్డీ వ్యాపారులు రెచ్చిపోతున్నారు. అధిక వడ్డీకి డబ్బులు ఇచ్చి వేధింపులకు గురిచేయడం సరికాదన్నందుకు కర్రలతో దాడి చేసి రెచ్చిపోయారు. పోలీసులకు ఫిర్యాదు చేసే ఆస్పత్రి నుంచి రిపోర్టు వచ్చిన తర్వాత చూస్తామంటూ సమాధానమిస్తున్నారని బాధితుని బంధువులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించి బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గిద్దలూరు మండలం దిగువమెట్టకు చెందిన ఆవుల నరసమ్మ, ఆమె చెల్లెలు లక్ష్మీదేవి గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా అధిక వడ్డీలకు, చీటీపాటల ద్వారా డబ్బులు ఇస్తుంటారు. ఈ నేపథ్యంలో అదే గ్రామానికి చెందిన వెంకటమ్మ అనే మహిళ నరసమ్మ వద్ద చీటీ పాడుకుంది. నెలకు రూ.5 వేలు చొప్పున ఆరు నెలల వాయిదాలు చెల్లించాల్సి ఉంది. ఆ డబ్బుల కోసం సోమవారం నరసమ్మ తన మనుషులతో కలసి వెంకటమ్మ ఇంటికి వచ్చింది. దుర్భాషలాడుతూ డబ్బులు చెల్లించాలని నిలదీసింది. ఆ సమయంలో వెంకటమ్మ సమీప బంధువు సుధాకర్ అధిక వడ్డీలు తీసుకోవడం పద్ధతి కాదని, డబ్బులకు మనుషులను ఈ విధంగా పీడించడం ఏమిటని ప్రశ్నించాడు. మధ్యలో నీకెందుకు అంటూ నరసమ్మ మనుషులు సుధాకర్, అతని భార్య శివాణి పై కర్రలతో విచక్షణారహితంగా దాడి చేశారు. ఈ దాడిలో సుధాకర్ తలకు, చేతులకు తీవ్రగాయాలయ్యాయి. అనంతరం గాయపడిన వారిని బంధువులు చికిత్స నిమిత్తం పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం సుధాకర్‌ను నంద్యాల వైద్యశాలకు తరలించారు. బాధితులు ఈ విషయమై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎనిమిది మంది వ్యక్తులు వచ్చి తమ వారిపై దాడికి పాల్పడ్డారని పోలీసులకు చెప్పారు. వైద్యశాల నుంచి రిపోర్టు వచ్చిన తరువాత కేసు నమోదు చేస్తామంటూ పోలీసులు సమాధానమిచ్చారు.

దీనిపై బాధితుల బంధువులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికార పార్టీ అండదండలు చూసుకుని డబ్బుల కోసం దాడికి పాల్పడుతున్నారని బాధితుల బంధువులు ఆరోపిస్తున్నారు. అధిక వడ్డీలకు డబ్బులు ఇచ్చి ప్రజలను పీడించే వారి పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు బెయిల్

పొదిలి: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పొదిలి పొగాకు బోర్డులో రైతుల సమస్యలు తెలుసుకునేందుకు వచ్చిన సందర్భంగా జరిగిన పరిణామాల నేపథ్యంలో అక్రమ కేసులు నమోదు కావటంతో 40 రోజులుగా రిమాండ్‌లో ఉన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు హైకోర్టు సోమవారం బెయిల్ మంజూరు చేసింది. దీంతో దర్శి సబ్ జైలులో ఉన్న శాగం రవీంద్ర, సప్పరపు వీరాంజనేయులు, షేక్.ఇంతియాజ్, ఒంగోలు జిల్లా జైలులో ఉన్న కోనేటి వెంకట శివ, కోనేటి రాజశేఖర్, షేక్.సుభాని, పూని వెంకటేశ్వర్లు బెయిల్‌పై మంగళవారం విడుదలయ్యారు. పార్టీ లీగల్ టీం సభ్యులు హైకోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేయటంతో పార్టీ కార్యకర్తలకు ఊరట లభించింది. అక్రమంగా అరెస్టయిన రోజు నుంచి, బెయిల్ వచ్చేంత వరకు నిత్యం లీగల్ టీంతో పని జరిగేలా కృషి చేసిన పార్టీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, మార్కాపురం ఇన్‌చార్జ్ అన్నా రాంబాబు, లీగల్ టీం సభ్యులు న్యాయవాది ధర్నాసి రామారావు తదితరులకు కార్యకర్తలు కృతజ్ఞతలు తెలిపారు.

నకిలీ పత్రాల కేసులో మరొకరికి రిమాండ్

కనిగిరిరూరల్: నకిలీ, తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించిన కేసులో మరొకరికి కనిగిరి కోర్టు జడ్జి రిమాండ్ విధించింది. పోలీసుల కథనం ప్రకారం నకిలీ, తప్పుడు పత్రాలు సృష్టించిన కేసులో 16వ నిందితుడు ముండ్లమూరు మండలం కెల్లంపల్లికి చెందిన జిల్లెల విజయభాస్కర్‌రెడ్డి సోమవారం కనిగిరి కోర్టులో మేజిస్ట్రేట్ ముందు లొంగిపోయాడు. జడ్జి సదరు వ్యక్తికి రిమాండ్ విధించగా, దర్శి సబ్ జైలుకు తరలించినట్లు సీఐ ఎస్‌కే ఖాజావలి తెలిపారు.

గొంతుదాటని మృత్యుకేక!

సింగరాయకొండ: పొట్టకూటి కోసం కూలీ పని చేసేందుకు వచ్చిన ఆ బధిరుడిని మృత్యువు ఊహించని రీతిలో బలితీసుకుంది. ప్రాణాలు పోతున్నాయని గట్టిగా అరిచి చెప్పలేని స్థితి.. తప్పించుకోవడానికి ఆస్కారం ఉన్నప్పటికీ అతని ఆర్తనాదం గొంతు దాటలేదు. ఈ విషాద ఘటన సింగరాయకొండ పరిధిలోని బీకే క్రషర్స్ కంపెనీలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. సింగరాయకొండకు చెందిన నన్నూరి వెంకటేశ్వర్లు(46) పుట్టకతోనే మాట్లాడలేడు. కూలీగా పనిచేస్తూ జీవిస్తున్నాడు. బీకే క్రషర్స్ కంపెనీలో లారీకి పొగాకు బేళ్లు లోడ్ చేసిన తర్వాత పట్ట కట్టారు. లారీ వెనుక భాగాన నిల్చున్న వెంకటేశ్వర్లును డ్రైవర్ గమనించకుండా వెనక్కి నడిపాడు. దీంతో లారీకి–ప్లాట్‌ఫాంకు మధ్య వెంకటేశ్వర్లు నలిగిపోయాడు. క్షతగాత్రుడిని ఒంగోలు జీజీహెచ్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి.మహేంద్ర తెలిపారు.

ఒకటి రెండైంది.. సమస్య మెండైంది!

ప్రజలతోపాటు రెవెన్యూ యంత్రాంగానికి తలబొప్పి కట్టిస్తున్న తహసీల్దార్ కార్యాలయాల విభజన

లాగిన్ల తారుమారుతో అటుఇటూ తిరుగుతూ దరఖాస్తుదారుల తిప్పలు

- ఒంగోలు తహసీల్దార్ల కార్యాలయాల్లో గందరగోళంగా లాగిన్స్
- సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకుంటే ప్రదక్షిణలు చేయాల్సిందే..
- గతంలో ఒకటిగా ఉన్న తహసీల్దార్ కార్యాలయం ఇటీవల రెండుగా విభజన
- ఒంగోలు అర్బన్, ఒంగోలు రూరల్ తహసీల్దార్ కార్యాలయాలుగా ఏర్పాటు
- అర్బన్ తహసీల్దార్‌కు దరఖాస్తు చేస్తే రూరల్‌కి.. రూరల్ తహసీల్దార్‌కు చేస్తే అర్బన్‌కు వెళ్తున్న దరఖాస్తులు
- ఎవరి దరఖాస్తు ఎక్కడుందో తెలియక కాళ్లరిగేలా తిరుగుతున్న ప్రజలు

ఒంగోలు సబర్బన్:

ఒంగోలు తహసీల్దార్ల కార్యాలయాల్లో అధికారుల లాగిన్లలో గందరగోళం నెలకొంది. వాటిలో ఏం జరుగుతోందో ఎవరికీ అంతుబట్టటం లేదు. రెండుమూడు నెలలుగా లాగిన్‌లలో సాంకేతిక సమస్య ఏర్పడటంతో దరఖాస్తుదారులకు చుక్కలు కనిపిస్తున్నాయి. గతంలో ఒంగోలు మండలం మొత్తానికి ఒకే తహసీల్దార్ కార్యాలయం ఉండేది. అలాంటిది ఏడాది క్రితం కొత్తగా ఒంగోలు అర్బన్ తహసీల్దార్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. మొదటి నుంచి ఉన్న తహసీల్దార్ కార్యాలయాన్ని ఒంగోలు రూరల్ తహసీల్దార్ కార్యాలయంగా మార్పు చేశారు. రెండు తహసీల్దార్ కార్యాలయాలుగా విభజించి రెండు కార్యాలయాలకు ఇద్దరు తహసీల్దార్లను కూడా నియమించారు. ఎవరి కార్యాలయాలను వాళ్లకు అప్పగించిన ఉన్నతాధికారులు ఎవరి లాగిన్‌ను వాళ్లకు ఏర్పాటు చేశారు కూడా. ఇంతవరకూ బాగానే ఉంది. అధికారులు, సిబ్బంది వరకు ఏ ఇబ్బందీ లేదు. మరి ఇబ్బంది వచ్చిపడిందల్లా ఒంగోలు అర్బన్, ఒంగోలు రూరల్ పరిధిలోని ప్రజలకే. ఏదైనా సర్టిఫికెట్ కావాలని గ్రామ, వార్డు సచివాలయంలోగానీ, మీ సేవా కేంద్రంలోగానీ దరఖాస్తు చేసుకుంటే.. అక్కడి నుంచే దరఖాస్తుదారునికి కష్టాలు ప్రారంభమవుతున్నాయి. సంబంధిత వీఆర్‌ఓతో సంతకం పెట్టించి మీ సేవలోగానీ, గ్రామ, వార్డు సచివాలయంలోగానీ దరఖాస్తు చేసుకుంటే.. ఆ దరఖాస్తు ఆన్‌లైన్‌లో వెంటనే రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్‌ఐ) లాగిన్‌కు రావాల్సి ఉంది. ఉదాహరణకు ఒంగోలు రూరల్ మండలం దేవరంపాడు గ్రామంలో దరఖాస్తు చేసుకున్న వ్యక్తి ఆ ఫైల్ తీసుకుని ఒంగోలు రూరల్ ఆర్‌ఐ వద్దకు వస్తే ఆ దరఖాస్తు ఆర్‌ఐ లాగిన్‌లో కనపడదు. అదేవిధంగా ఒంగోలు అర్బన్‌కు చెందిన దరఖాస్తుదారుడు ఇందిరమ్మ కాలనీలోని వార్డు సచివాలయంలో ఇన్‌కం సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకుని ఒంగోలు అర్బన్ ఆర్‌ఐ వద్దకు వెళ్తే ఆ దరఖాస్తు ఒంగోలు అర్బన్ ఆర్‌ఐ లాగిన్‌లో కనబడదు. మీ సేవలో, సచివాలయాల్లో చేసిన దరఖాస్తులు ఏమవుతున్నాయని పరిశీలించగా, చివరకు తేలిందేమిటంటే ఒంగోలు అర్బన్ తహసీల్దార్‌కు దరఖాస్తు చేసుకుంటే ఒంగోలు రూరల్ తహసీల్దార్ లాగిన్‌కు, రూరల్‌లో దరఖాస్తు చేసుకుంటే అర్బర్ తహసీల్దార్‌కు వెళుతున్నాయి.



ఒంగోలు అర్బన్ తహసీల్దార్ కార్యాలయం



ఒంగోలు రూరల్ తహసీల్దార్ కార్యాలయం

వారాల తరబడి తిరగాల్సిన దుస్థితి...

తహసీల్దార్ కార్యాలయాలలో లాగిన్ సమస్యలతో అధికారులు తలలు పట్టుకోవటం ఒక ఎత్తయితే, దరఖాస్తు చేసుకున్న ప్రజలు అధికారులు, కార్యాలయాల చుట్టూ వారాల తరబడి తిరగాల్సిన దుస్థితి నెలకొంది. రెండు తహసీల్దార్ కార్యాలయాలు వేరైనప్పటికీ.. అధికారులు, సిబ్బంది వేరైనప్పటికీ ఒక్కో దరఖాస్తుదారుడు మాత్రం ఒంగోలు అర్బన్, రూరల్ తహసీల్దార్ల వద్దకు, ఇద్దరు ఆర్‌ఐల వద్దకు, ఇద్దరు కంప్యూటర్ ఆపరేటర్ల వద్దకు, ఇద్దరు డిప్యూటీ తహసీల్దార్ల వద్దకు ప్రదక్షిణలు చేస్తూ నానా అవస్థలు పడుతున్నాడు. ఒకవైపు స్కూళ్లు, కాలేజీలు ప్రారంభమయ్యాయి. మరోవైపు తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ లాంటి పథకాల కోసం దరఖాస్తు చేసుకోవటానికి నానా అవస్థలు పడుతున్నారు. రేషన్‌కార్డులకు దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతోంది. తమ దరఖాస్తు ఎక్కడుందో తెలుసుకునేసరికే దరఖాస్తుదారులకు తలప్రాణం తోకలోకి వస్తోంది. వీటన్నింటికీ కారణం లాగిన్స్ అస్తవ్యస్తంగా తయారుకావడమే. ఒంగోలు నగరంలోని ప్రజలతో పాటు ఒంగోలు రూరల్ మండలంలోని గ్రామాల ప్రజలు సైతం తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరగలేక నానా ఇబ్బందులు పడుతున్నారు.

> **లాగిన్లు తారుమారైన విషయం వాస్తవమే**
>
> ఒంగోలు అర్బన్, ఒంగోలు రూరల్ తహసీల్దార్ కార్యాలయాలకు సంబంధించిన లాగిన్లు తారుమారైన విషయం వాస్తవమే. ఒంగోలు అర్బన్‌లోని శివారు గ్రామాలకు చెందిన లాగిన్లు ఒంగోలు రూరల్ తహసీల్దార్ లాగిన్‌కు వెళ్తున్నాయి. అదేవిధంగా ఒంగోలు మండలంలోని కొన్ని రూరల్ గ్రామాలకు చెందిన దరఖాస్తులు ఒంగోలు అర్బన్ తహసీల్దార్ కార్యాలయానికి చెందిన ఆర్‌ఐ, వీఆర్‌ఓ, తహసీల్దార్ లాగిన్లకు వస్తున్నాయి. వీటిని గమనించి ఆర్‌ఐలు, వీఆర్‌ఓలకు తగిన సలహాలు, సూచనలు చేశాం. ప్రజలకు, దరఖాస్తుదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా లాగిన్లు చెక్ చేసుకునేలా ఆదేశాలు జారీ చేశాం. ప్రజలకు ఇబ్బంది లేకుండా అధికారులే మార్పులు చేసుకునే విధంగా ఏర్పాట్లు చేశాం. ఈ విషయంపై జిల్లా కేంద్రంలోని గ్రామ సచివాలయం, వార్డు సచివాలయం (జీఎస్‌డబ్ల్యూఎస్) కార్యాలయ కో ఆర్డినేటర్‌కు లేఖ కూడా రాశాం.
>
> – పిన్నిక మధుసూదన్‌రావు, ఒంగోలు అర్బన్ తహసీల్దార్

వారానికి రూ.700 వస్తున్నాయమ్మా..!

- కలెక్టర్ వద్ద వాపోయిన ఉపాధి కూలీలు
- అధికారులపై కలెక్టర్ ఆగ్రహం
- బంగారు కుటుంబంపై అవగాహన లేకపోవడంపై మండిపాటు

కంభం: 'ఉపాధి కూలి గిట్టుబాటు కావడం లేదమ్మా. కొన్నిసార్లు వారానికి రూ.700 నుంచి రూ.800 మాత్రమే వస్తున్నాయి' అని ఉపాధి కూలీలు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. మండలంలోని కందులాపురం, కంభం పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన రైతువారి నీటి గుంతలను మంగళవారం ఆమె పరిశీలించారు. రైతులతో మాట్లాడి సాగు చేస్తున్న పంటల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉపాధి కూలీలతో మాట్లాడారు. మండలంలో ఎంతమంది ఉపాధిహామీ కూలీలు ఉన్నారు, వారిలో ఎంతమంది ఎంత పనిచేశారు, పని చేసిన కాలానికి ఎంత వరకు నగదు జమైందో విషయాలను డ్వామా అధికారులను అడిగి తెలుసుకున్నారు. బంగారు కుటుంబంపై ఉపాధి సిబ్బందికి కనీస అవగాహన లేకపోవడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సభలు నిర్వహించి అందరికీ అవగాహన కల్పించాలని సూచించారు. అధికారులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వర్షం నీరు వృథాగా పోకుండా భూమిలోకి ఇంకించేందుకు నీటి కుంటలు ఉపయోగపడతాయన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 1075 రైతువారి నీటికుంటలు పూర్తి చేశామని, మరో 800 నీటికుంటలు పురోగతిలో ఉన్నాయన్నారు. పశ్చిమ ప్రకాశంలో రైతువారి నీటి కుంటల నిర్మాణం ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని, రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మార్కాపురం సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, డ్వామా పీడీ జోసఫ్ కుమార్, తహసీల్దార్ వి.కిరణ్, ఏపీడీ భాస్కరరావు, ఏపీఓ జీవరత్నం, ఇన్‌చార్జి ఎంపీడీఓ ఖాదర్, డిప్యూటీ ఎంపీడీఓ విజయలక్ష్మి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



కూలి తక్కువగా పడుతున్నాయని కలెక్టర్‌కు చెబుతున్న ఉపాధికూలీలు

గురుకుల పాఠశాలలో ముఖాముఖి

స్థానిక అంబేడ్కర్ గురుకుల బాలికల విద్యాలయంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా పదోతరగతి, ఇంటర్మీడియెట్ విద్యార్థినులతో ముఖాముఖి నిర్వహించారు. సుమారు 20 నిమిషాల పాటు వారితో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. విద్యార్థినులు నీటి సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా..తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలన్నారు. అనంతరం ఆర్వోప్లాంట్‌ను, విద్యార్థినుల గదులను పరిశీలించారు.

కంది విత్తనాలు కొందరికే..!



కొనకనమిట్ల రైతు సేవా కేంద్రం వద్ద రైతుల పడిగాపులు

కొనకనమిట్ల: కంది విత్తనాల పంపిణీ తీరుపై కొనకనమిట్లలో రైతులు తీవ్ర అసంతృప్తి, ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక రైతు సేవా కేంద్రంలో మంగళవారం కంది విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు ఏఈఓ, వీఏఏలు చెప్పడంతో ఆశగా వెళ్లిన రైతులకు భంగపాటు ఎదురైంది. ఉచితంగా కంది విత్తనాలు ఇస్తున్నట్లు చెప్పడంతో పెద్ద సంఖ్యలో రైతులు తమ భూముల జిరాక్స్ కాపీలతో వెళ్లారు. మధ్యాహ్నం వరకు 40 మంది రైతులకు ఒక్కొక్కరికి 4 కిలోల చొప్పున విత్తనాలు పంపిణీ చేసిన అధికారులు సర్వర్ పని చేయడం లేదని, మరో 40 మందికే విత్తనాలు ఇస్తామని స్పష్టం చేయడంతో రైతులు ఆగ్రహించారు. తమ పరిస్థితి ఏమిటని వీఏఏని నిలదీయడంతో 'మేమేం చేయలేం. ప్రభుత్వం 80 ప్యాకెట్లు ఇచ్చింది. అవే పంచుతున్నామ'ని జవాబిచ్చారు. దీనిపై ఏఓ ప్రకాష్‌రావును వివరణ కోరగా మండలానికి 70 క్వింటాళ్ల కంది విత్తనాలు వచ్చాయని, సాగు చేసే రైతులే తీసుకోవాలని చెప్పారు.

ఒక్క రోజే 1,001 బేళ్ల తిరస్కరణ

టంగుటూరు/కొండపి: టంగుటూరు, కొండపి వేలం కేంద్రాల పరిధిలో మంగళవారం ఒక్క రోజే 1,001 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. వేలం కేంద్రాల చరిత్రలో ఒకే రోజు ఇన్ని బేళ్లు తిరస్కరణకు కాలేదు. వ్యాపారులంతా కుమ్మక్కై రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారు. ఇప్పటికే 8 రౌండ్లు వేలం ముగిసినా నిత్యం వందల సంఖ్యలో బేళ్లు తిరస్కరణకు గురవుతున్నాయి. నిన్న మొన్నటి వరకు రోజుకు 300 పైచిలుకు బేళ్లు తిరస్కరిస్తుంటే మంగళవారం ఒక్కో కేంద్రంలో 500 పైచిలుకు బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. మంగళవారం టంగుటూరు వేలం కేంద్రానికి 973 బేళ్లు రాగా 406 బేళ్లు కొనుగోలుచేసి 567 బేళ్లు తిరస్కరించారు. గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.160, సరాసరి ధర రూ.216.83గా నమోదైంది. వేలంలో 36 మంది వ్యాపారులు పాల్గొన్నట్లు బోర్డు అధికారులు ప్రకటిస్తున్నా..వాస్తవానికి 10 మంది కూడా పాల్గొనడం లేదు. దీంతో ఉన్న వ్యాపారులంతా కుమ్మక్కై ఇష్టం వచ్చినట్లు ధరలు ఇచ్చి బేళ్లను తిరస్కరిస్తున్నారు. టంగుటూరు వేలం కేంద్రంలోకి రైతులను రానివ్వకుండా వేలం నిర్వహించడం విశేషం. అసలు రైతులను బయట పెట్టి వేలం నిర్వహించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. కొండపిలో 9వ రౌండ్ వేలం మంగళవారం ప్రారంభమైంది. ఈ రౌండ్‌లోనైనా ధరలు వస్తాయని రైతులు ఆశలు పెట్టుకుంటే వారి ఆశలు ఆడియాశలు చేస్తూ ఒకే రోజు 534 బేళ్లను తిరస్కరించారు. జువ్విగుంట, అయ్యవారిపాలెం, జాళ్లపాలెం, పీరాపురం, తంగెళ్ల గ్రామాల రైతులు 1176 బేళ్లను తీసుకురాగా 642 బేళ్లను కొనుగోలు చేసి 534 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.280, కనిష్ట ధరరూ.159, సరాసరి ధర రూ.241.01గా నమోదైంది.



టంగుటూరులో వేలం కేంద్రం లోనికి అనుమతించకపోవడంతో బయట ఉన్న రైతులు

వివాహిత అనుమానాస్పద మృతి



ఐశ్వర్య మృతదేహం

దర్శి: పట్టణంలోని లంకోజనపల్లి రోడ్డుకు చెందిన రావులపల్లి ఐశ్వర్య(21) అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. సోమవారం సాయంత్రం 9 గంటల ప్రాంతంలో లంకోజనపల్లి రోడ్డులోని తమ నివాసంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబీకులు తెలిపారు. మృతురాలు కుటుంబీకులు తెలిపిన వివరాల మేరకు..బొట్లపాలెం గ్రామానికి చెందిన మాడపాకుల అంజయ్య కుమార్తె ఐశ్వర్యను ఏడాదిన్నర క్రితం రావులపల్లి వంశీకి ఇచ్చి వివాహం చేశారు. అప్పటి నుంచి అదనపు కట్నం కోసం తమ కుమార్తెను వేధించేవాడని తెలిపారు. ఇటీవల వేధింపులు ఎక్కువ కావడంతో సోమవారం రాత్రి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. ఈ విషయంపై ఎస్సై మురళీని వివరణ కోరగా..భర్త వేధిపులు కారణంగా భార్య ఉరేసుకోని ఆత్మహత్య చేసుకుందని కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. డీఎస్పీ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో విచారణ చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

వితంతు పెన్షన్ల మంజూరుకు వితండవాదం

- సర్పంచ్ భర్త చెబితేనే ఎంపీడీఓ ఇస్తారట!
- తాళ్లూరు మండలం కొర్రపాటివారిపాలెం మహిళ ఆవేదన

తాళ్లూరు: ప్రభుత్వ అధికారులను టీడీపీ నేతలు ఏ స్థాయిలో నియంత్రిస్తున్నారో తెలిపే ఉదంతమిది. పింఛన్లు మంజూరు కాకుండా మోకాలడ్డుతూ రాక్షసానందం పొందుతున్న టీడీపీ నేతలకు అధికారులు తలొంచుతున్న తీరు తరచూ చర్చనీయాంశమవుతోంది. వివరాల్లోకి వెళ్తే.. తాళ్లూరు మండలంలోని కొర్రపాటివారిపాలెం గ్రామానికి చెందిన గోనుగుంట పద్మావతి, కొర్రపాటి బుచ్చమ్మ వితంతు పింఛనుకు అర్హులు. తమకు పింఛను మంజూరు చేయాలని గత కొంత కాలంగా ఎంపీడీఓ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. 'మీ ఊరి సర్పంచ్ భర్త రామయ్య చెబితేనే పింఛను వస్తుందమ్మా' అని ఎంపీడీఓ దారా హనుమంతరావు చెబుతున్నారని ఇద్దరు మహిళలు వాపోయారు. 'కలెక్టర్ గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చినా మండల అధికారులు స్పందించడం లేదు. మేము వైఎస్సార్ సీపీ సానుభూతిపరులమనే కారణంతో టీడీపీ వాళ్లు పింఛను రాకుండా ఎంపీడీఓపై ఒత్తిడి చేస్తున్నార'ని ఆరోపించారు. ఈ విషయమై ఎంపీడీఓను వివరణ కోరగా.. వారు పింఛను కోసం వచ్చిన మాట వాస్తవమే. అనారోగ్యం దృష్ట్యా ఈ మధ్య సెలవులో ఉన్నా. వచ్చే సోమవారంలోగా సమస్య పరిష్కరిస్తా' అని చెప్పారు.



బాధితులు గోనుగుంట పద్మావతి, కొర్రపాటి బుచ్చమ్మ

రోడ్డు ప్రమాదంలో హెచ్‌ఈఓ మృతి



నాగేశ్వరరావు మృతదేహం

బేస్తవారిపేట: రోడ్డు ప్రమాదంలో మోక్షగుండం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెచ్‌ఈఓగా పనిచేస్తున్న శగునాల నాగేశ్వరరావు(57) మంగళవారం మృతి చెందారు. ఈ సంఘటన మండలంలోని మోక్షగుండం సమీపంలో ఒంగోలు–నంద్యాల హైవేరోడ్డుపై జరిగింది. వివరాల్లోకి వెళితే..హజరత్‌గూడెం నుంచి స్కూటీపై నాగేశ్వరరావు పీహెచ్‌సీ బయలుదేరాడు. మోక్షగుండం సమీపంలో వైద్యశాలలోనికి వెళ్లేందుకు హైవేరోడ్డు క్రాస్ చేసే సమయంలో బ్రహ్మంగారిమఠం నుంచి గుంటూరు వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ సంఘటనలో నాగేశ్వరరావు తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రున్ని 108లో కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలించే సమయంలో మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

వ్యాయామ ఉపాధ్యాయునిపై విచారణ

సింగరాయకొండ: మండలంలోని ఊళ్లపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయునిపై వచ్చిన ఆరోపణలపై కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశాలతో డీఈఓ నియమించిన త్రిసభ్య కమిటీ సభ్యులు మంగళవారం విచారణ చేపట్టారు. కమిటీ సభ్యులు ఒంగోలు డిప్యూటీ డీఈఓ చంద్రమౌళీశ్వరరావు, జీసీడీఓ కె.హేమలత, ఎంఈఓ–1 కె.శ్రీనివాసులు ముందుగా పాఠశాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థినులతో సమావేశమయ్యారు. తరువాత ఒక విద్యార్థి తల్లిని పిలిపించి ఆమె అభిప్రాయాన్ని రాతపూర్వకంగా తెలుసుకున్నారు. చివరగా ఊళ్లపాలెం ఉన్నత పాఠశాలకు వచ్చి విచారణ చేపట్టాల్సి ఉండగా డీఈఓ నుంచి అత్యవసర సమావేశం అని ఫోన్ రావడంతో బుధవారం విచారణ కొనసాగిస్తామని వెళ్లిపోయారు. విచారణ వివరాలను కమిటీ సభ్యులు గోప్యంగా ఉంచారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న డీవైఈఓ చంద్రమౌళీశ్వరరావు